క్లుప్తంగా

పరీక్ష సామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందుకున్న విద్యార్థులతో నాయకులు

పుత్తూరు: స్థానిక గేట్‌పుత్తూరులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆదివారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు పంపిణీ చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రభాకర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. సంఘం ఆధ్వర్యంలో రేణిగుంట, తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తిలోని గురుకుల రెసిడెన్సీ పాఠశాలల్లో పదో తరగతి చదివే ప్రతి విద్యార్థికి పరీక్ష సామగ్రిని అందించడం జరుగుతోందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ గంగరాజు, సంఘ నాయకులు హరినాథ్, నిర్మల, ముత్యాలరెడ్డి, మురళి, చంద్రశేఖర్, బ్రహ్మయ్య, వెంకటరత్నం, పుల్లయ్య, విజయకుమార్, మునిరత్నం, శ్రీనివాసులు, శంకరయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నాగులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగులమ్మ

నింద్ర: మండలంలోని చవరంబాకం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో నాగులమ్మకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

కామధేనువుపై గరళ కంఠుడి చిద్విలాసం



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం గరళ కంఠుడు కామధేను వాహనంపై ఊరేగారు. ఉదయం పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం కామధేను వాహనంపై అధిష్ఠింపజేసి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. చెన్నైకి చెందిన నరసింహులు రేవతి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్ర, ట్రస్టు బోర్డు మెంబరు ఆనందయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ

రేణిగుంట: పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించనున్నట్లు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పేరూరు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



పూడిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఫైల్)



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఫైల్)

పూడి.. ప్రగతిలో మేటి..

నాటి టీడీపీ ప్రభుత్వంలో వడమాలపేట మండలంలోని పూడి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. జన్మభూమి కమిటీ నాయకుల చేతుల్లో గ్రామ ప్రజలు పలు కష్టాలు అనుభవించారు. రేషన్‌కార్డు అందుకోవాలన్నా, ఒక సంక్షేమ పథకం లబ్ధి పొందాలన్నా అల్లాడిపోయిన ప్రజలు నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని సంక్షేమాల లబ్ధిని ఇంటి వద్ద నుంచే అందుకుంటున్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలు వెలిశాయి. అన్ని ప్రభుత్వ సేవలు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందుతున్నాయి.

- గత టీడీపీ ప్రభుత్వంలో అటకెక్కిన అభివృద్ధి
- నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన పూడి గ్రామ రూపురేఖలు
- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా పూడి సచివాలయ పరిధిలో అందిన లబ్ధి రూ.22.06 కోట్లు



వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఫైల్)

పుత్తూరు: వడమాలపేట మండలం పూడి సచివాలయ పరిధిలో 910 కుటుంబాలకు గాను 3,558 మంది జనాభా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ పూడి పంచాయతీని పూర్తిగా విస్మరించింది. రోడ్లు, వీధిలైట్లు, కాలువలు, మంచినీరు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. రేషన్ కార్డు పొందాలంటే కూడా జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి పరిస్థితి. ఇంటి పట్టాల ఊసేలేదు. ఇలా గ్రామస్తులు ఎన్నో రకాల ఇబ్బందులను అనుభవించారు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో కాయం పంచాయతీని కలుపుకుని పూడి సచివాలయం ఏర్పడింది. గడచిన నాలుగున్నరేళ్లలో ఒక్క పూడి సచివాయ పరిధిలో రూ.22.06 కోట్ల మేర లబ్ధి పొందారు ఇక్కడి ప్రజలు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో ప్రతి గ్రామంలో వీధిలైట్లు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరిగింది. రూ.35 లక్షలతో సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్‌ను మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రత్యేకించి తుడా నిధులు రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరుగుతున్నాయి. గత నాలుగు రోజుల వ్యవధిలో రూ.కోటి నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. నేటి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నగదు రూ.లలో
జగనన్న అమ్మఒడి	284	1,26,97,424
జగనన్న విద్యా దీవెన	257	77,03,115
జగనన్న వసతి దీవెన	217	34,93,185
వైఎస్సార్ రైతు భరోసా	348	1,78,18,000
వైఎస్సార్ ఉచిత పంట బీమా	3	5,116
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	56	1,62,135
వైఎస్సార్ పింఛన్ కానుక	556	4,99,56,250
వైఎస్సార్ చేయూత	243	1,08,37,500
వైఎస్సార్ ఆసరా	605	3,29,69,851
వైఎస్సార్ సున్నా వడ్డీ	710	44,30,381
వైఎస్సార్ కాపు నేస్తం	2	1,05,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	32	9,45,000
వైఎస్సార్ కల్యాణమస్తు/షాదీతోఫా	2	1,75,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	130	53,36,036
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	79	4,66,375
హౌసింగ్	115	1,26,98,973
వైఎస్సార్ బీమా	3	9,00,000
వైఎస్సార్ వాహన మిత్ర	14	3,70,000
జగనన్న చేదోడు	16	4,00,000
కోవిడ్ ప్రత్యేక సహాయం	765	7,65,000
జగనన్న తోడు	63	33,965
ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా చేకూరిన లబ్ధి		రూ.16,22,68,306
పరోక్ష ప్రయోజనాల ద్వారా చేకూరిన లబ్ధి		రూ.5,84,00,226
ప్రత్యక్ష, పరోక్షంగా అందిన మొత్తం		రూ.22,06,68,532

ఈ ప్రభుత్వంలోనే సాధ్యమైంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహకారంతోనే పూడి సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగింది. మంత్రి రోజా మా పూడి సచివాలయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. తుడా నిధులు సైతం మా పంచాయతీ అభివృద్ధికి మంజూరు చేయించడం ఇందుకు నిదర్శనం. ఆమె నేతృత్వంలో మరింత అభివృద్ధి సాధిస్తామన్న నమ్మకం ఉంది. -ఏ.కుసుమ, సర్పంచ్, పూడి గ్రామం, వడమాలపేట మండలం

నా కంటి వెలుగు రోజమ్మ



నాపేరు బాషా. పూడి గ్రామం. గత కొంతకాలంగా కంటి చూపు మందగించి తీవ్ర ఇబ్బంది పడ్డాను. పని చేసుకోలేక, ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో మంత్రి రోజమ్మ నాకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించి చూపునిచ్చారు. ఆమె చేసిన మేలు నేను, నాకుటుంబ సభ్యులు జీవితంలో మరువం. నాకు వ్యక్తిగతంగానే కాదు. మా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. -షేక్‌సలీంబాషా, పూడి గ్రామం

ఎన్నడూ లేనంత అభివృద్ధి



గతంలో ఎన్నడూ లేనంతగా మా పూడి పంచాయతీలో అభివృద్ధి జరిగింది. అర్హులైన వారికి అన్ని సంక్షేమ పథకాలు అందాయి. ఇంతగా ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు. మంత్రి రోజా కృషి ఫలితంగానే మా గ్రామం బాగుపడింది. మరోసారి జగనన్న ప్రభుత్వం రావాలని ఆకాంక్షిస్తున్నాను. -కె.రామిరెడ్డి, పూడి గ్రామం

సచివాలయ వ్యవస్థ గొప్ప ఆలోచన



సచివాలయ వ్యవస్థను తీసుకురావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన గొప్ప ఆలోచన. అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సేవలందించిన ప్రభుత్వాలను నేనెప్పుడు చూడలేదు. మా గ్రామంలోని అన్ని వర్గాల వారికి అన్ని ప్రభుత్వ పథకాలు అందాయి. మా గ్రామస్తులంతా సంతోషంగా ఉన్నారు. -ఏ.దేవరాజులు, పూడి గ్రామం

సర్పంచ్ సహకారం బాగుంది



మా గ్రామాభివృద్ధిలో గ్రామ సర్పంచ్ కుసుమది కీలకపాత్ర. ఆమె చొరవతోనే గ్రామంలో సమస్యలు పరిష్కారమయ్యాయి. మంత్రి రోజా సైతం మా గ్రామానికి పలుమార్లు వచ్చారు. ఆమె మా గ్రామానికి వచ్చిన ప్రతిసారి ఒక అభివృద్ధి పని పూర్తి చేశారనే విషయం కనిపిస్తుంది. ప్రత్యేకించి మహిళల పట్ల ఆమెకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. -పి.మీనా, పూడి గ్రామం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



జగన్నాథపురంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో మంత్రి రోజా

- రాష్ట్రంలో సీఎం జగనన్న సంక్షేమ పాలన నడుస్తోంది
- విజయపురంలో టీడీపీ ఖాళీ అవడం ఖాయం
- మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం: రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురంలో ఆమె సమక్షంలో 30 మంది టీడీపీ నాయకులు, పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి రోజా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగనన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు అండగా నిలిచారన్నారు. అందుకే జగనన్న పాలన నచ్చి ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చి చేరుతున్నారని తెలిపారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన డి.అశోక్‌రాజు, విజయ్ కుమార్, శీను, నాగయ్య, లోకనాథశెట్టి, మునస్వామి, వెంకటేశులు, సుశీలతో 30 మంది వారి అనుచరులు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి ఆర్‌కే రోజా కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయపురం మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. ఎన్నికలలోపు ఇక్కడ టీడీపీ ఖాళీ అవుతుందని మంత్రి రోజా అన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పరిపాలన, నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పరిపాలన చూసి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, కన్వీనర్ గోపీ, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్, మునికృష్ణ, కుమార్, భాస్కర్‌రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ ఏపీ

- కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాల అమలు
- మీకు మంచి జరిగుంటేనే ఓటెయ్యండని సీఎం జగనన్న ధైర్యంగా అడుగుతున్నారు
- మంత్రి రోజా



జగన్నాథపురంలో ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం: సంక్షేమం, అభివృద్ధి అందించిన వారికే ఓటు అడిగే హక్కు ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం జగన్నాథపురంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న రాష్ట్రంలో, నగరిలో తాను పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు, అభివృద్ధి చేశామని అందుకే ధైర్యంగా ఓటు అడుగుతున్నామని తెలిపారు. సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పనివి కూడా చేసి చూపించారని అన్నారు. జగన్నాథపురంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాయని తెలిపారు. అందులో వైఎస్సార్ పెన్షన్, చేయూత, ఆసరా, రైతు భరోసా కింద రూ.9.66 కోట్లు అందించడం జరిగిందన్నారు. అలాగే సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రోడ్లు తదితర వాటి నిర్మాణం కోసం దాదాపు రూ.1.20 కోట్లు వెచ్చించామని తెలిపారు. ఈ గ్రామానికి మొత్తం రూ.12.23 కోట్ల మేర సంక్షేమం, అభివృద్ధి పనులకు వెచ్చించామని తెలిపారు.

చంద్రబాబు ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

చంద్రబాబు నాయుడు 2014లో అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా పూర్తి స్థాయిలో నెరవేర్చాడా అని మంత్రి రోజా ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయిందని, అప్పుల్లో ఉందని, కష్టాల్లో ఉన్నామని, కుంటిసాకులు చెప్పి తండ్రీ, కొడుకులు ఇద్దరు దోచుకుతిన్నారని ఆరోపించారు. అదే అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎలా అభివృద్ధి చేశారో రాష్ట్ర ప్రజలు కళ్లారా చూశారన్నారు. విజయపురం మండలం 35 ఏళ్లుగా టీడీపీకి కంచుకోటగా ఉండేదని, అయితే ఈసారి ఎమ్మెల్యే, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ సభ్యులను మీరు గెలిపించారంటే జగనన్న చేస్తున్న సంక్షేమం నచ్చి రివర్స్ గిఫ్ట్‌గా ఇచ్చారని భావిస్తా అన్నారు. గత నాలుగున్నరేళ్లలో మండలంలో 748 ఇళ్ల పట్టాలు ఇచ్చామని, ప్రస్తుతం జగన్నాథపురంలో 24 ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు.

కోవిడ్ సమయంలో ఎక్కడికెళ్లారు..?

తెలుగుదేశం నాయకులు ఎన్నికల ముందు మాత్రమే కనబడుతారని, కోవిడ్ సమయం ఎక్కడికి వెళ్లారో ప్రజలే వారిని ప్రశ్నించాలని మంత్రి రోజా అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సంక్షేమ పాలనను తిరిగి తీసుకొచ్చిన జగనన్నను మరోమారు ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ గోపి, చెంచురాఘవరాజు, మునికృష్ణ, సర్పంచ్ భాస్కర్‌రాజు, కుమార్, ఎంపీటీసీ రాజ్‌గోపాల్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



నాటి గురువులతో ఉగ్రాణంపల్లి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

శ్రీరంగరాజపురం: 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అంతా ఒకచోట కలవడం ఓ అద్భుతం అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామచంద్రయ్య అన్నారు. మండలంలోని ఆరిమాకులపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామచంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకం అని, నాడు తాము విద్యను బోధించిన విద్యార్థులు నేడు తహసీల్దార్లుగా, డాక్టర్లుగా, బిల్డర్లుగా, పారిశ్రామిక వేత్తలుగా, ప్రభుత్వ ఉదోగుగా వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నతస్థితికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. పది మందికి సహాయపడి మీరు ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలు, చదువు వారి ప్రేరణ తమ ఉన్నతస్థితికి ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు నగదును ఉపాధ్యాయులకు అక్కడే అందజేశారు.

ఉగ్రాణంపల్లెలో..

పెనుమూరు(కార్వేటినగరం): ఉగ్రాణంపల్లి ఉన్నత పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 40 ఏళ్ల తరువాత నాటి విద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి గురువులు రామ్మూర్తి, విజయభాస్కర్‌రెడ్డి, సరస్వతిని శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న ఉగ్రాణంపల్లి ఉన్నత పాఠశాలలో సబావేదిక నిర్మాణానికి రూ.2 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- రెండు చుక్కలతో చిన్నారులకు భవిష్యత్
- పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి







కార్వేటినగరం: పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ ధనంజయవర్మ, పాలసముద్రం: వీఆర్‌కుప్పంలో, పెనుమూరులో..







విజయపురం: పోలియో చుక్కలను వేస్తున్న డాక్టర్ సందీప్‌రాజు, నింద్రలో ..., పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రమణ్యం

కార్వేటినగరం: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమి కొట్టేందుకు రెండు పోలియో చుక్కలు దోహదపడతాయని అలాగే పోలియో చుక్కలతోనే పిల్లలకు ఆరోగ్య రక్షణ అని అన్నారు. అదేవిధంగా మండలంలోని 22 పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హేమశ్రీ, పర్యవేక్షకులు అంబరీష్‌రాజు, పీహెచ్‌ఎన్ గౌరి, సీహెచ్‌ఓ కవిత, ఏఎన్‌ఎం సుమతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: పోలియో రహిత సమాజం నిర్మించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్‌రాజు అన్నారు. రెండు చుక్కలు వేయించండి పోలియో మహమ్మారిని తరిమి వేయండని అన్నారు. అనంతరం ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): పోలియో నివారణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పోలియో చుక్కలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పోలియో చుక్కల పంపిణీని ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని చింతపెంటలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో 98 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర చైర్మన్ ఎస్.శివప్రకాష్ రాజు, వైద్యాధికారి మోహన్‌కృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. మండల పరిసర గ్రామాల్లో 19 కేంద్రాల్లో మొత్తం 2,767 మంది 5 ఏళ్లలోపు పిల్లలు ఉండగా 2,726 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

రెండు చుక్కలతో పోలియోను తరిమేద్దాం..

వెదురుకుప్పం: మండలంలో 98 శాతం పల్స్‌పోలియో విజయవంతం అయినట్లు మెడికల్ ఆఫీసర్ సురేఖ తెలిపారు. వెదురుకుప్పంలో ఎంపీడీఓ పురుషోత్తం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం పిల్లలు 4,619 మంది ఉండగా 4,527 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

పుత్తూరు: పోలియో రహిత సమాజమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ మునివేలు అన్నారు. ఆదివారం పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆమె మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర/విజయపురం: మండల కేంద్రాలు నింద్ర, విజయపురంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీల్లో ఎంపీపీ దీప, అధికారులు ప్రారంభించారు. నింద్రలో మొత్తం 2,837 మంది పిల్లలకు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ భవానీ, సర్పంచ్ బాబు రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక వైద్యాధికారి దుర్గా దేవి మాట్లాడుతూ మండల పరిధిలో 3910 మందికి తొలిరోజు పోలియో చుక్కలు వేశామని తెలిపారు.